

# భక్తిగిరి
## వసుంధర

### భక్తి భావన పై సరికొత్త దృక్కోణం



## దేవుడున్నాడు

దూర్వాసుడు, విశ్వామిత్రుడు, భృగువు వంటి ఋషులకీ – అనసూయ, సుమతి, సావిత్రి వంటి పతివ్రతలకీ దేవతలు భయపడేవారు. దశరథుడు, పురూరవుడు, భీష్ముడు, అర్జునుడు వంటి పురుషోత్తములను దేవతలు గౌరవించేవారు. దైవత్వం కంటే మానవత్వం గొప్పదనడానికి మన పురాణాలనిండా ఇలాంటి ఉదాహరణలు కోకొల్లలు. ఐనప్పటికీ – మన దశావతారాల విశ్లేషణలో – దైవత్వంపై నమ్మకమే జ్ఞానాన్వేషణలో తొలిమెట్టు అనుకోవడం సబబే అనిపించుకుంటుంది. ఎందుకంటే మానవత్వం రాణించడానికి అహం పోవాలనీ, అందుకు దైవభక్తి గొప్పగా సహకరిస్తుందనీ కూడా పురాణాలు చెబుతాయి. దేవుడుంటేనే కదా దైవ భక్తి – కానీ మానవత్వాన్ని మాత్రమే నమ్మే హేతువాదులు దేవుడి ఉనికిని అంత సులభంగా నమ్మరు.

దైవత్వం నుంచీ ఆశించిన ఫలితం జాప్యమైతే, 'నీవే తప్ప నితఃపరంబెరుంగ... సంరక్షింపు భద్రాత్మకా!' అనే భక్తుడే 'కలడు కలండనేడివాడు కలడో లేడో' అనే మీమాంస వచ్చిన సందర్భాలు భక్తి కావ్యాల్లోనే లెక్కలేనన్ని. ఐతే దేవుడనే వాడున్నాడా అని మనిషికి సందేహం కలిగినప్పుడల్లా – మనుషులనేవారున్నారా అని దేవునికీ అనుమానమొస్తుందంటూ – ఆచార్య ఆత్రేయ ఓ సినీగీతంలో – మానవత్వానికీ కొన్ని బాధ్యతలుంటాయని చక్కగా హెచ్చరించారు.

ఏ ఇల్లైనా వస్తువులన్నీ చిందరవందరై అస్తవ్యస్తంగానూ, సాలెగూళ్ళతో నిండి అపరిశుభ్రంగానూ ఉంటే, 'ఇది మనుషులుండే ఇల్లేనా?' అనడం కద్దు. అంటే మానవత్వానికి నిదర్శనం పద్ధతి, శుభ్రత. మొదట్లో భూమ్మీద మొక్కలు, చెట్లు ఇష్టం వచ్చినట్లు సామూహికంగా పెరిగి అడువులు ఏర్పడితే – క్రమంగా వాటిలో మృగాలు చేరి స్థిరనివాసమేర్పరచుకున్నాయి. మానవత్వంలేని కాలంలో మనిషి కూడా అడవుల్లోనే మృగాల మధ్య తానూ ఓ మృగంలా ఉండేవాడు. మానవత్వం ప్రవేశించాక అడవులు వదిలి నాగరికుడయ్యాడు. అప్పుడతడు తన అవసరాలకోసం శుభ్రత పాటిస్తూ పద్ధతి ప్రకారం పెంచిన మొక్కలు, చెట్లు తోటలై భూమ్మీద మనిషి ఉనికికి నిదర్శనమయ్యాయి.

ప్రకృతి నిర్మాణంలో మూల పదార్థాలు మూలకాలు (elements). నేలైనా, చెట్లైనా, బట్టైనా, నగలైనా - మూలకాల సమూహమే. ఇప్పటికి మనిషి కనుగొన్న మూలకాల సంఖ్య 112 దాటింది. ఇంకా కొత్తవి కనుగొనే అవకాశమున్నప్పటికీ - మనిషికీ - మనిషికి మూలకాల మూలస్వరూపం మీద ఇప్పటికే చెప్పుకోతగ్గ అవగాహన ఏర్పడింది. ఆ ప్రకారం ప్రతి మూలకమూ ఒకే లక్షణాలున్న అనేక పరమాణువుల సమూహం. ఆ పరమాణువు కేంద్రంలో ఉండే న్యూక్లియస్ పాజిటివ్ ఛార్జి కలిగిన ప్రోటాన్లతో నిండి ఉంటుంది. ఆ న్యూక్లియస్ చుట్టూ ప్రోటాన్లన్నీ ఎలక్ట్రాన్లు నెగెటివ్ ఛార్జితో ఒక పరిధిలో తిరుగుతుంటాయి. ప్రోటాన్లు మౌలికం భౌతిక లక్షణాలనూ, స్వభావాన్నీ నిర్ణయిస్తే, ఎలక్ట్రాన్లు రసాయనిక గుణాలను నిర్దేశిస్తాయి. చిత్రమేమిటంటే ఈ మూలకాలన్నీ ప్రకృతిలోని అడవిలాకాక, మనిషి చేసిన తోటల్లా ఒక పద్ధతిలో తయారయ్యాయి. ఉదాహరణకి న్యూక్లియస్‌లో ఒకే ఒక్క ప్రోటానుంటే అది హైడ్రోజన్ పరమాణువు. ఆ న్యూకియస్‌కి మరో ప్రోటాన్ కలిపితే, రెండు ప్రోటాన్లున్న హీలియమ్ పరమాణువు తయారౌతుంది. అలా ప్రొటాన్లు 6 ఉంటే కార్బన్ (బొగ్గు), 8 ఉంటే ఆక్సిజన్ (ప్రాణవాయువు), 13 ఉంటే అల్యూమినియం, 14 ఉంటే సిలికాన్ (మట్టికీ, ఇసుకకూ ముఖ్యమైన మూలకం), 26 ఉంటే ఇనుము, 47 ఉంటే వెండి, 79 ఉంటే బంగారం. న్యూక్లియస్‌కి ప్రొటాన్లు కలిపి వెండిని బంగారం చేయొచ్చునన్న మాట! సృష్టికి మూలమైన మూలకాలు ఇంత పద్ధతిగా తయారవడాన్ని కాకతాళీయమని సరిపెట్టుకుంటే - భూమ్మీది పంట పొలాలూ, తోటలూ, కట్టడాలూ కూడా అంతేనంటుంది తర్కం. అందుకని మూలకాల నిర్మాణ ప్రక్రియ మన ఊహకందని ఓ అద్భుత శక్తి ఉనికికి నిదర్శనమని ఒప్పుకోక తప్పదు. ఆ శక్తికి ఎవరేం పేరు పెట్టినా ఎక్కువమంది పెట్టుకున్న పేరు దేవుడు.

మూలకాలను పద్ధతిగా సృష్టించిన దేవుడూ అడవులను కూడా పద్ధతిగా సృష్టిస్తే మనిషికి నివాసయోగ్యమయ్యేవి కదా అని హేతువాదులనవచ్చు. కానీ ప్రకృతి కేవలం మనుషులకని కాక - సృష్టిలోని మొత్తం జంతుజాలానికి అనుకూలంగా ఆవిర్భవించింది. జంతువులకు భిన్నంగా ఉండాలనుకున్న మనిషి తన పద్ధతిలో సృష్టికి ప్రతి సృష్టి చేసి మానవత్వాన్ని దైవత్వానికి భిన్నం చేసాడు. ఆ ప్రయత్నంలోనూ దేవుడి ఉనికికి లభించే నిదర్శనాలు కోకొల్లలనడానికి ఉదాహరణగా ఓ చిన్న కథ!

ఒక నాస్తికుడు ఆస్తికుడు - అడవిలో ఉండే ఓ గురువు దగ్గరకి బయలుదేరారు. చాలాసేపు అడవిలో తిరిగాక గురువు ఆశ్రమం కనపడింది. లోపల ఎవరూ లేరు కానీ నోరూరించే భక్ష్యాలు సిద్ధంగా ఉన్నాయి. అప్పటికే ఇద్దరికీ బాగా ఆకలేస్తుండడం వల్ల ఆ పదార్థాలు తిని కడుపు నింపుకున్నారు. తన ఆకలి తీర్చినందుకు ఆస్తికుడు దేవుణ్ణి కీర్తించాడు. నాస్తికుడు వెంటనే, 'గురువు మనకోసం వంట చేసి ఎక్కడికో వెళ్ళాడు. ఏమయ్యాడో తెలియదు కానీ ఆయనవల్లనే మన ఆకలి తీరింది. ఆయన్ని పొగడాలి కానీ - కంటికి కనిపించని దేవుణ్ణి కీర్తించడం మూర్ఖత్వం' అని తప్పు పట్టాడు. ఆస్థికుడు నవ్వి, 'నువ్వంటున్న గురువు ఇప్పుడు కంటికి కనిపించడం లేదు. ఐనా ఆయనున్నాడని నమ్ముతున్నావు. అలాగే నేను దేవుడి ఉనికిని నమ్ముతున్నాను' అన్నాడు.

'నా నమ్మకానిక్కారణం ఈ ఆశ్రమమూ, ఇక్కడి భోజనమూనూ. ఈ రెండూ మనిషి సృష్టి అని నిర్ణయించడానికి తర్క శాస్త్రం అవసరం లేదు, లోకజ్ఞానం చాలు' అన్నాడు నాస్తికుడు.

ఆస్తికుడు వెంటనే, 'ఈ ఇంట్లో ఇలాంటి పరిస్థితుల్లో మనక్కావాల్సిన ఏర్పాట్లు చేసినవాడు నీకు మనిషైతే, నాకు దేవుడు, ఏదేమైనా ఏర్పాట్లు చూసి మనిషి ఉనికిని నమ్మావు కదా! మరి ఈ భూమ్మీద మన మనుగడకి అవసరమైన గాలి, నీరు, ఆహారం అడక్కుండానే ప్రకృతిలో లభ్యమవుతున్నాయి కదా! ఆ ఏర్పాట్లక్కారణ భూతమైన అద్భుత శక్తిని కూడా నమ్మాలి. ఆ శక్తిని

నువ్వేమంటావో కానీ నేను మాత్రం దేవుడంటున్నాను. పేర్లలో తేడా తప్పితే తార్కికంగా ఆలోచిస్తే నువ్వూ నేనూ కూడా దేవుణ్ణి నమ్మాలి' అన్నాడు.

దేవుణ్ణి దేవుడనకపోయినా ఆయన ఉనికిని నమ్మక తప్పదని చెప్పే ఈ కథ విన్నాక కూడా హేతువాదులు - ఆధునిక విజ్ఞానంలో సాధించిన అసాధారణ ప్రగతి ఆధారంగా మనిషే ఎక్కువని నిర్ధారించవచ్చు. కానీ నీటిలోంచి విద్యుత్తునీ, అణువునుంచీ అపరిమిత శక్తినీ వెలికి తీయడమే మనిషి ప్రతిభ అనుకుంటే - వాటి ఉనికికి కారణభూతమైన అదృశ్య శక్తికి గొప్పతనం అతణ్ణి మించినదే కదా! ఆ అదృశ్యశక్తినే ఎందరో దేవుడన్నాడు!

ఇంతకీ దేవుడి ఉనికిని నిర్ధారించడం వల్ల మనిషికి ఒరిగినదేమిటి, లేకపోతే నష్టమేమిటని కొందరంటారు. దేవుణ్ణి నమ్మే మనిషిలో మానవత్వం విలువ సంతరించుకుని - సాటి మనిషికి ప్రయోజనాన్నిచ్చి మానవజాతిని ప్రగతి మార్గంలో నడిపిస్తుంది. దేవుణ్ణి నమ్మని మనిషిలో మానవత్వం కుంటుపడి మానవజాతి వినాశనానికి దారితీస్తుంది. ఐతే దేవుడి పేరుతో మారణహోమాలు చేసేవారూ ఉన్నారు - సాటి మనిషిని బాధించడాన్ని నిరసిస్తూ విశ్వశాంతికి దోహదం చేసేవారు - సాటి మనిషికి మేలు చేయడమే దైవత్వం కాబట్టి - వారు దేవుణ్ణి నమ్మడం లేదనుకునే ఆస్తికులు. దేవుణ్ణి నమ్మినా నమ్మకపోయినా - తెలిసో తెలియకో అందరూ ఆస్థికులే ఐతే కనుక - మనుషులనేవారున్నారా అన్న అనుమానం దేవుడికి కలగదు.

అడిగినా అడక్కున్నా మనక్కావలసినవి సమకూర్చే భగవంతుణ్ణి అవగాహన చేసుకుందుకు భక్తిమార్గమే సాధనం, మనిషి పతనానికి మూలకారణమైన అహాన్ని నశింపజేసేదీ భక్తిమార్గమే! ఆధునిక యుగంలో భక్తిమార్గంపట్ల మతపరంగా కాక తార్కికమైన అవగాహన కలిగించే ఉడతా భక్తి ప్రయత్నమే 'భక్తిగిరి'. అడిగి వేదికనిచ్చిన 'కౌముది'కి ధన్యవాదాలర్పిస్తూ - ఇకమీదట ఈ వేదిక అడిగిన పాఠకులకు మాత్రమే పరిమితం కాగలదని మనవి చేసుకుంటూ ఈ వ్యాస పరంపరను మా వైపు నుంచీ ముగిస్తున్నాం.

భక్తి శ్లోకాల్లో స్త్రీ దేవతల అంగాంగ వర్ణన సమర్థనీయమా అన్న ఓ పాఠకురాలి సందేహాన్ని వచ్చే నెల చర్చిద్దాం.